

మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

సంగారెడ్డి ప్రజలకు స్వచ్ఛమైన మంజీరా నీళ్ల సరఫరాపై జగ్గారెడ్డి సమీక్ష

- మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి రాజంపేట ఫిల్టర్ బెడ్‌ను తనిఖీ చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్యపై మున్సిపల్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాజంపేటలో ఉన్న ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారలకు జగ్గారెడ్డి పలు సూచనలు చేశారు.

- 2010లో మంజీరా వాటర్ స్కీమ్ ప్రారంభించినప్పుడు ఒకేసారి పది ట్యాంకులు నిండి గంటన్నర నీటి సరఫరా జరిగేది. ఇప్పుడు కూడా అలాగే జరిగేలా చూడాలి.
- మిషన్ భగీరథ కోసం సింగూరు ప్రాజెక్టు వద్ద రూ.100 కోట్లతో నిర్మించిన ఫిల్టర్‌బెడ్‌ను పదేళ్ల ఒక కాంట్రాక్టర్‌కు మెయింటెనెన్స్‌కు ఇచ్చారని, అతను పట్టించుకోకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ లైన్స్ పాడై సరఫరాకు ఇబ్బందవుతుందని జగ్గారెడ్డికి అధికారులు వివరించారు.
- పాతలైన్ల స్థానంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ లైన్‌లు నాణ్యతగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని జగ్గారెడ్డి దృష్టికి తెచ్చారు.





సంగారెడ్డిలోని రాజంపేట ఫిల్టర్‌బెడ్ వద్ద నిర్వహించిన సమీక్షలోమాట్లాడుతున్న జగ్గారెడ్డి, ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తూ..

- పట్టణంలో పది ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా అయ్యేలా చూడాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు.
- ఫిల్టర్‌బెడ్ విస్తరణకు మూడు ఎకరాల ప్రైవేట్ భూమి కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.
- ఇంకా పాత పద్ధతుల్లోనే నీటిని ఫిల్టర్ చేస్తున్నారని, ఫిల్టర్‌బెడ్‌లో అపరిశుభ్రత ఉంటుందని స్థానికులు జగ్గారెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేశారు.
- ఫిల్టర్‌బెడ్ నిర్వహణ మున్సిపల్‌దా లేక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారా అని అధికారులను జగ్గారెడ్డి అడిగారు.
- గతంలో ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు సదరు కాంట్రాక్టర్ డబ్బు ఇవ్వకపోతే సబ్‌కాంట్రాక్టర్‌కు జగ్గారెడ్డి రూ.20 లక్షల తన స్వంత నిధులను ఇచ్చిన విషయాన్ని ఓ కాంట్రాక్టర్ గుర్తుచేశారు.
- ఫిల్టర్‌బెడ్ నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించేలా అనుమతి ఇవ్వాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు లేఖ ద్వారా విన్నవించాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రఘు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్‌కుమార్, మహేష్, కిరణ్‌గౌడ్, రాజంపేట శ్రీనివాస్, అరుణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఆస్తుల కోసమే అన్నాచెల్లెలి కొట్లాట

- ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

చేగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ దినదినం దిగజారిపోతుందని, అక్రమంగా సంపాదించుకున్న ఆస్తుల కోసం అన్నాచెల్లెలికి కొట్లాట మొదలైందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ విమర్శించారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని వడియారంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 17 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కంకణం కట్టుకుందన్నారు. పేదవారికి విద్య, వైద్యం, అందుబాటులో తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచిన ఘనత తమదేనన్నారు. రూ.9000 కోట్లతో గురుకులాల్లో విద్యార్థులకు సన్న బియ్యం పథక అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 12 లక్షల రేషన్‌కార్డులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉండగా, 50 శాతమే సరఫరా చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రామగుండం ఫర్టిలైజర్ ప్లాంటును మన్మోహన్ సింగ్ సహకారంతో ప్రారంభిస్తే బీజేపీ హయాంలో మూతపడిందని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, నెలకు రూ.5000 కోట్ల రూపాయలు మిత్తిని కడుతున్నామన్నారు. అనంతరం దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నేత దార సత్యనారాయణ, వివిధ గ్రామాల నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మేకల పరమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రజనీర్ ప్రవీణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్నసాగర్'లో కొత్త లొల్లి

తాత్కాలికంగా ఒకరికి డబుల్ ఇల్లు

రిజిస్ట్రేషన్ మరొకరికి..

ఖాళీ చేయించడంతో మనస్తాపం 7

భార్యాపిల్లలతో కలిసి అదృశ్యం



ఆహార భద్రత చట్టం సక్రమంగా అమలవ్వాలి

పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకంద్ శర్మ 7

చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి..

దౌల్తాబాద్ విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన సిబ్బంది 7





నారింజ పరీవాహక ప్రాంతంలో వరద నీటిలో మొక్కజొన్న పంట

రేగోడు మండలం మర్పల్లి మంబోజి చెరువు నిండడంతో నీట మునిగిన వరిచేను

మూడు రోజులు కురిసిన భారీ వర్షాలు మెదక్, సంగారెడ్డి జిల్లాలను ముంచెత్తాయి. ఎడతెరిపి లేకుండా పడిన వానలకు చెరువులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో వరద నీరు పొలాల్లోకి చేరడంతో పంటలు నీట మునిగి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయా వంటి పంటలు దెబ్బతిన్నాయి. నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉన్నారు.

ముంచేసిన

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు భారీ నష్టం
- వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన
- పలుచోట్ల వర్షాలకు కూలిన ఇళ్లు



కంగ్టిలో వాన దెబ్బకు నేలవాలిన పత్తి మొక్కలు

మెదక్/తూప్రాన్/నారాయణఖేడ్/చిన్నశంకరంపేట/పెద్దశంకరంపేట/జహీరాబాద్/కోహీర్/రేగోడు/నాగల్‌గిద్ద/కంగ్టి/మనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్, పాపన్నపేట మండలాల్లో పంటనష్టం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అల్లాదుర్గంలో వాగులు ఉప్పొంగడం, చెరువులకు గండ్లు పడటం వల్ల వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పెద్దశంకరంపేటలో చెరువుల అలుగులు పొంగి మొక్కజొన్న, వరి పంటలను ముంచెత్తాయి. టేక్మాల్‌లో లోతట్టు ప్రాంతాల్లో పత్తి, వరితో పాటు కొంతమేర కంది, పెసర పంటలు దెబ్బతిన్నాయి. పాపన్నపేట మండలం ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లడంతో డ్యామ్ వెనక సాగైన వరి పంట నీట మునిగింది. రైతులు కష్టపడి వేల రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు, ఎరువులు వేసిన పంటలు కళ్ల ముందే నాశనం కావడంతో తీవ్ర వేదనకు గురవుతున్నారు.

పంట పొలాల పరిశీలన

రైతుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఈ మేరకు పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు మెదక్ జిల్లా వ్యవసాయ శాఖాధికారి దేవ్‌కుమార్ తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు నష్టం వివరాలను సేకరిస్తున్నారు.

నిండుకుండలా పెద్దచెరువు 7

పొంచి ఉన్న ముంపు

పలు మండలాల్లో పరిస్థితి..

- పెద్దశంకరంపేట మండలంలో వ్యవసాయ అధికారి నాదం కృష్ణ పర్యటించి 500 ఎకరాల్లో వరి, 78 ఎకరాల పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు.
- రేగోడు మండలంలో మంబోజి చెరువు అలుగు పారటంతో పోచారం, కొండాపూర్, జగర్యాల, ప్యారారం, లింగంపల్లి, గజవాడ, రేగోడు గ్రామాల్లో పత్తి పంట నీట మునిగింది.
- కంగ్టి మండలంలో పలు

మిగతా 8వ పేజీలో

చెరువులకు మరమ్మతులు చేపట్టాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో గండ్లు పడి దెబ్బతిన్న చెరువులు, కుంటలను వెంటనే మరమ్మతు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. అల్లాదుర్గం మండలంలో గండిపడిన బట్టికుంట చెరువును, నీట మునిగిన పంటపొలాలను, దెబ్బతిన్న రహదారులతో పాటు మండలంలోని చిల్వర్‌లో కోతకు గురైన నల్లకుంట చెరువు కట్టను బుధవారం ఆయన పరిశీలించారు. భారీస్థాయిలో పడిన గండ్లను పూడ్చేందుకు అయ్యే వ్యయంపై ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో లింగప్ప, ఇరిగేషన్ ఏఈ వైష్ణవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, లింగప్ప తదితరులు ఉన్నారు.



అల్లాదుర్గం మండలం చిల్వర్‌లో కోతకు గురైన నల్లకుంట చెరువు కట్టను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నల్లవాగును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

- చివరి ఆయకట్టు వరకు సాగు నీరందేలా చర్యలు
- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

నారాయణఖేడ్/కల్హేర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : నల్లవాగు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి నల్లవాగు ప్రాజెక్టు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా మార్చడానికి ప్రయత్నాలు ప్రారంభించారని తెలిపారు. ఎక్కడైనా వరదల కారణంగా ఇబ్బందులు కలిగితే ఎఫ్‌డీఆర్ నిధుల కింద తక్షణమే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి, మరుగుదొడ్లు, బాత్‌రూంలను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సిర్గాపూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నారాయణఖేడ్‌లోని ప్రాంతీయ వైద్యశాలను కలెక్టర ప్రావీణ్యఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ, ఇన్‌పేషేంట్‌ల వివరాలను పరిశీలించారు. ఎంసీహెచ్, జనరల్, డయాలసిస్ వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట సబ్‌కలెక్టర్ ఉమాహారతి, నీటి పారుదల శాఖ ఈఈ సుందర్, జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్ సంగారెడ్డి, స్థానిక వైద్యశాల సూపరిండెంట్ రమేష్, నాయకులు తదితరులు ఉన్నారు.



నల్లవాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య




క్యూ కట్టి.. రోడ్డెక్కి..

యూరియా కోసం అన్నదాతల అవస్థలు.. ఆందోళనలు, రాస్తారోకోలు

7

రామాయంపేటలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు





పచ్చని పరవశం



జహీరాబాద్ పరిసర ప్రాంతాలు ప్రకృతి రమణీయతకు నిలయం. ఆనెగుంట-లచ్చునాయక్‌తాండ రోడ్డుకు ఇరువైపులా పంటపొలాలతో ఆహ్లాదాన్ని పంచుతున్నది. విట్టునాయక్‌తండాలో ఇళ్లు గుట్టపై పచ్చదనం మధ్య ఆహ్లాదభరితంగా ఉన్నాయి. గోవిందాపూర్ మీదుగా మొగుడంపల్లి, ఇప్పెపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఏపుగా పెరిగిన చెట్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. జహీరాబాద్ - బీదర్ మార్గంలో రైల్వేగేటు నుంచి అల్లానా చౌరస్తా వరకు, కోహీర్ - కవేలి మధ్య రోడ్డుపై దట్టమైన చెట్లు పచ్చని పందిరిలా దర్శనమిస్తున్నాయి.

\- జహీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)



సైబర్ నేరాలపై అప్రమత్తత

రేగోడు ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పోచయ్య సూచించారు. బుధవారం రేగోడు గాంధీ చౌక్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దని అన్నారు. ఏదైనా సందర్భంలో డబ్బులు పోగొట్టుకుంటే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

60 పరిశ్రమల పన్ను వాణిజ్య సరళిలోకి ..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఐడీఏబొల్లారం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో, ప్రచురితమైన రావాల్సింది రూ.8కోట్లు.. వసూలు చేసేది రూ.12.40లక్షలు అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆర్‌వో నర్సింహులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని కమిషనర్ కిషన్ ఏర్పాటు చేశారు. రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్న పరిశ్రమలను గుర్తించే సర్వే చేయించారు. 93 పరిశ్రమలు రెసిడెన్షియల్ జోన్‌లో ఉన్నట్టు గుర్తించారు. వాటన్నిటికి వాణిజ్యసరళిలో పన్నులు వసూలు చేయనున్నారు. ఇప్పటి వరకు 60 పరిశ్రమలను వాణిజ్యసరళిలోకి మార్చారు. దీంతో రూ.వేలల్లో ఉన్న పన్ను లక్షల్లోకి చేరింది.

మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించాలి


● వినాయకచవితి శాంతియుతంగా జరుపుకోవాలి
● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
● విద్యుత్ అనుమతులు పొందాలి
● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. మండపాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వర్షాలతో పాడైన రోడ్లను మరమ్మతులు చేయాలని, అన్నదానం రోజున తాగు నీటి సదుపాయని కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి జరిగే వినాయక ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మట్టి గణపతిని పూజిద్దామని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామనే నినాదంతో వినాయకులను ప్రతిష్ఠంచాలన్నారు. మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ ద్వారా గణపతి మండపాలకు అనుమతులు జారీ చేయాలని, తీగలు కింద, స్తంభాల పక్కన మండపాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శనానికి తగిన ఏర్పాట్లు చేయలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నిర్వాహకులు పోలీసులతో సమన్వయం కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు గోదారమ్మ


కొండపోచమ్మసాగర్‌లోని విడుదల చేసిన నీరు

మర్కుక్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీటి పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఒక పంపు ద్వారా ఆ నీటిని పంపింగ్ చేస్తున్నామని, వరద ఉధృతిని బట్టి మిగిలిన పంపులను ప్రారంభిస్తామని కొండపోచమ్మ ఇరిగేషన్ ఏఈ సాయిరెడ్డి తెలిపారు.

ఇంటికి ఐదు వేల చొప్పున ఇవ్వు..!

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏఈ చేతివాటం.!
● మేస్త్రీని లంచం అడిగిన ఆడియో వైరల్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన మేస్త్రీ వద్ద ఇంటికి రూ. 5 వేల చొప్పున పట్టుకురమ్మని హౌసింగ్ ఏఈ ఫోన్ చేసిన ఉదంతం ఇది. ఇందుకు సంబంధించిన ఆడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో 183 మందికి ఇళ్లు మంజూరు కాగా, గ్రామానికి చెందిన మేస్త్రీ వెంకటయ్య 18 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో హౌసింగ్ ఏఈ ఫోన్ చేసి లంచం డిమాండ్ చేసినట్లు ఆడియో వైరల్ అవుతోంది. ఆ ఆడియాలో.. 'ఎన్ని ఇళ్లు కడుతున్నావయ్యా.. నేను బిల్లులు ఇచ్చే పెద్దసారును. 18 కడుతున్నావ్.. సార్‌ను కలువాలనే బుద్ధి, జ్ఞానం ఏమైనా ఉన్నదా.. నీకు. తెలువకపోతే తెలుసుకోవాలి. నన్ను వెంకయ్య సార్ అంటారు. మీ సెక్రటరీకి తెలుసు. నేను అమౌంట్ అడుగుతానని ఊరుకున్నాడు. ఒక్కో ఇంటికి రూ. 5 వేలు, రూ. 10 వేలు ఇస్తారు. సారుకు ఇవ్వాలని తెలువదా.. అడిగేదాక చూస్తారా' అని ఏఈ మాట్లాడినట్లు ఉంది. ఇందుకు సమాధానంగా మేస్త్రీ 'ధరలు ఎక్కువగా ఉన్నాయి' అనగా, ఇంటికి రూ. 5 వేల చొప్పున రూ.25 వేలు తీసుకురా' .. తక్కువ రేటుకు పట్టుకున్నా అని మేస్త్రీ అనడంతో నేనున్నాకదా అనే సమాధానం వినిపించింది. ఈ విషయమై ఏఈని సంప్రదించగా, 'నేను లంచం అడగలేదు. వేరే వ్యక్తి నుంచి డబ్బులు పంపించారు. మళ్లీ తిరిగి అతనికే పంపించాను. ఇదంతా నాపై కావాలని ప్రచారం చేస్తున్నారు' అని వివరణ ఇచ్చారు. అయితే, వైరల్ అయిన ఆడియోపై విచారణ కోసం హౌసింగ్ పీడీ దామోదార్ డీఈని నియమించినట్లు సమాచారం.

మాత్‌పల్లిలో జాతీయ మానసికారోగ్య సర్వే


ఎన్ఎంహెచ్ సర్వేలో కేంద్ర వైద్య బృందం

కుకునూరుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాత్‌పల్లి గ్రామంలో ఎయిమ్స్ బీబీనగర్, బెంగళూరు ఆధ్వర్యంలో నేషనల్ మెంటల్ హెల్త్‌సర్వే చేపట్టారు. ప్రాజెక్ట్ పరిశీలకులు డాక్టర్ కులకర్ణి, సాయికృష్ణ, స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజల మానసిక, ఆరోగ్య, జీవనశైలి సమస్యలు వాటిపై అవగాహన చికిత్స ఇతర అంశాలను సేకరించారు. మానసిక సమస్యలకు 174416ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సర్వే జాతీయ మానసిక ఆరోగ్య విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

440 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్ ప్లాజా వద్ద బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు ఎండు గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కరీంనగర్‌కు చెందిన తాజ్ మహ్మద్ అనే వ్యక్తి వద్ద 440గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎండు గంజాయితోపాటు నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

కుటుంబ పోషణ భారమై గృహిణి ఆత్మహత్య

తూప్రాన్, అగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భర్త మరణంతో కుటుంబ పోషణ భారమై గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానంద కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన గజ్జల బాబుకు మాసాయిపేటకు చెందిన సంధ్యతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలల క్రితం గజ్జల బాబు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాబు భార్య సంధ్య(34) ఇద్దరు పిల్లలతో ఉంటోంది. కుటుంబ పోషణ భారం కావడంతో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. 13న ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు పంపి వంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



కోహెడలో ఎరువుల కోసం క్యూలో నిల్చున్న రైతులు

క్యూ కట్టి.. రోడ్డెక్కి..

యూరియా కోసం అన్నదాతల అవస్థలు.. ఆందోళనలు, రాస్తారోకోలు



ముస్తాబాద్-సిద్దిపేట రోడ్డు రాఘవాపూర్ చౌరస్తాలో నిర్వహించిన ఆందోళనలో ఎస్ఐకి దండం పెడుతున్న రైతు



గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో ధర్నా చేస్తున్న రైతులు



మిరుదొడ్డి : అక్బర్‌పేట చౌరస్తాలో యూరియా కోసం రైతుల ధర్నా

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యూరియా కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు యూరియా వేయాల్సిన సమయం ఆసన్నం కావడంతో ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద రైతులు భారీగా క్యూ కడుతున్నారు. బుధవారం కూడా మండల కేంద్రాల్లోని పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల వద్ద రైతులు బారులు తీరారు. సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌లోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాశారు. బుధవారం 560 బస్తాల యూరియా లారీ రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. తమ ఆధార్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను వెతుక్కోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వచ్చి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టారు. ఎకరాకు ఒక బస్తా, ఆపైన భూమి ఉన్న వారికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. సరిపడా యూరియా దొరకని రైతులు నిరాశగా వెనుదిరిగారు.

నంగునూరులో చెప్పులతో క్యూ

నంగునూరు మండలంలోనూ రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. యూరియా కోసం తెల్లవారుజాము నుంచే సహకార సంఘాల వద్ద బారులు తీరారు. పాలమాకుల గ్రామంలో ఎరువుల లారీ రాకముందే తమ చెప్పులను క్యూలో పెట్టి రైతులు వేచి చూశారు. 20 ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు యూరియా వేయకపోతే దిగుబడి తగ్గుతుందని, పంటలు ఎర్రబారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు మానుకొని వారం రోజులుగా ఎరువుల కోసం ఎదురుచూస్తున్నామని రైతు బుచ్చయ్య చెప్పారు.

రాస్తారోకోలు, ధర్నాలు..

సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. గంటకు పైగా రాస్తారోకో జరగడంతో వాహనాలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో యూరియా కొరత ఉండేది కాదని, ఇప్పుడు యూరియా కోసం ఇళ్లు, వ్యవసాయం వదిలి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రం అక్బర్‌పేట-భూంపల్లిలోనూ రైతులు ధర్నా నిర్వహించారు. చేగుంట మండలం మక్కరాజుపేటలోనూ యూరియా కొరతపై గజ్వేల్ రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో కూడా రైతులు ధర్నాకు దిగారు. రైతుల ఆందోళనలు గమనించిన పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి ధర్నాలను విరమింపజేశారు.

వారం రోజులుగా యూరియా రాలే..

నర్సాపూర్‌లో వారం రోజులుగా యూరియా రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేయగా, రెండు రోజుల్లో వస్తుందని అధికారులు వారిని సముదాయించారు కొల్చారం మండలం రంగంపేటలో ఒక లారీ యూరియా మాత్రమే రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ మాట్లాడుతూ, రెండు రోజుల్లో యూరియా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. మిరుదొడ్డిలో ఎస్ఐ హరీష్ అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

రైతులు అవసరం మేరకే కొనుగోలు చేయాలి

- మెదక్ జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా
- మరో పది రోజుల్లో 1500 మెట్రిక్ టన్నులు వస్తుంది
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



టేక్మాల్ ఆగ్రోస్ సేవాకేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

టేక్మాల్/పాపన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన టేక్మాల్ మండలంలోని ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాపన్నపేట మండలం లక్ష్మీనగర్‌లోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొందరు కావాలని వదంతులు సృష్టించడం వల్లనే రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 900 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, పది రోజుల్లో 1500 మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. సెప్టెంబర్‌లో మరో 4000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందకుండా అవసరం మేరకు కొనుగోలు చేయాలన్నారు నానో యూరియాను కూడా వాడాలని సూచించారు. తహసీల్దార్ తులసిరాం, ఎంపీడీవో రియాజొద్దీన్, ఏవో రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.



దుబ్బాకలోని శివాజీ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన రైతులు



హుస్నాబాద్‌లో రైతులకు నచ్చజెప్పుతున్న పోలీసులు



చేగుంట మండలం మక్క, రాజుపేటలో గజ్వేల్ రహదారిపై రైతుల బైఠాయింపు

చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి..

- మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన సిబ్బంది



చెరువులో ఉన్న విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నిండుకుండలా ఉన్న చెరువులోకి ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. 132 సబ్ స్టేషన్ నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ ద్వారా దౌల్తాబాద్ మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేస్తారు. ఈ విద్యుత్ లైన్ మధ్యలో ఓ స్తంభంపై ఇన్సులేటర్ ఫెయిల్ అయి, మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ స్తంభం చెరువు మధ్యలో ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండుకుండా మారింది. ఎలాగైనా మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని పునుకున్న విద్యుత్ లైన్‌మన్ రాజేష్, ఏఎల్ఎంలు సుభాష్, అజయ్, రవీందర్, రాకేష్, జేఎల్ఎం అన్నజీర్, రాజేశేఖర్, సీఎం శ్రీమాన్ నర్సింహులు బుధవారం సాయంత్రం చెరువులో ఈదుకుంటూ విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లారు. స్తంభం ఎక్కి ఇన్సులేటర్ సరిచేసి, మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేశారు. చెరువులోకి దిగి, ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేసిన విద్యుత్ అధికారులు, సిబ్బందిని మండల కేంద్ర ప్రజలు అభినందించారు.

ఆహార భద్రత చట్టం సక్రమంగా అమలవ్వాలి

- పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకుంద్ శర్మ



మాట్లాడుతున్న పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకుంద్ శర్మ

కోహీర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని పంజాబ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ బాల్ ముకుంద్ శర్మ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ, పంజాబ్ ఫుడ్ కమిషన్ సభ్యులతో కలిసి కోహీర్ మండలం దిగ్వాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. పంజాబ్ రాష్ట్రంలోని 19 వేల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలను పాఠశాల ఆవరణలోనే పెంచుతున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలో ఆహార భద్రత చట్టం అమలు తీరును పరిశీలించేందుకు తాము వచ్చామని చెప్పారు. దిగ్వాల్ పాఠశాలలో భోజనంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి తిన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణాన్ని కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ ఫుడ్ కమిషన్ సభ్యులు విజయ్ దత్త, చేతన్ ప్రకాష్ ధన్‌వాల్, జస్వీర్ సింగ్, తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆనంద్, డీఈఓ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూఓ లలితకుమారి, టీజీఆర్ఓ అధికారిణి జ్యోతి, ఎంఈఓ జాకీర్ హుస్సేన్, సీడీపీఓ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా పెద్దచెరువు.. పొంచి ఉన్న ముంపు

- వందెకరాల జీవవైవిధ్య చెరువుకు జలకళ
- నీటమునిగిన కాలనీల రోడ్లు
- ముంపునకు గురయ్యే కాలనీలపై హైడ్రా నజర్

అమీన్‌పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని శివారులో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పెద్దచెరువు భారీ వర్షాలతో నిండిపోయింది. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు పోటెత్తడంతో చెరువు మినీ రిజర్వాయర్‌లా కనిపిస్తోంది. వరదనీటి కాలువలు ఆక్రమణలకు గురికావడంతో పరిసర ప్రాంతాల కాలనీలకు ముంపు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గరిష్ఠ నీటిమట్టం పెరిగితే లోతట్టు ప్రాంతాలైన పాంచజన్య, వెదిరి, వాణీనగర్, హెచ్ఎంటీ కాలనీల్లోని కొన్ని ఇళ్లు మునిగిపోయే ప్రమాదం ఉంది. వరద కాలువలను పునరుద్ధరించాలని గ్రామస్థులు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులను కోరుతున్నారు.

కాలనీల రోడ్లు జలమయం

పెద్దచెరువుకు అనుసంధానంగా ఉన్న బంధంకొమ్ము చెరువులోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక్కడి కాలువలను కూడా ఆక్రమించడంతో భవానీపురం, వీరారెడ్డి కాలనీ, వెంకటరమణ కాలనీలలోని రోడ్లు నీట మునిగాయి. వరదనీరు మరింత పెరిగితే ఇళ్లు, అపార్ట్‌మెంట్ల సెల్లార్లు కూడా నిండిపోయే ప్రమాదం ఉందని కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొందరు నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో, హైడ్రా సిబ్బంది కాలనీలను పరిశీలించారు. అవంతిక అనే నిర్మాణ సంస్థ దారిమళ్లించిన వరద కాల్వను పరిశీలించారు. నీరు ముంచెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలను అప్రమత్తం చేశారు. వరద కాలువలపై సమగ్ర సర్వే నిర్వహించి వాటిని పునరుద్ధరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.



నిండుకుండను తలపిస్తున్న అమీన్‌పూర్ పెద్దచెరువు

మల్లన్నసాగర్‌లో కొత్త లొల్లి

- తాత్కాలికంగా ఒకరికి డబుల్ ఇల్లు..
- రిజిస్ట్రేషన్ మరొకరికి..
- ఖాళీ చేయించడంతో మనస్తాపం
- భార్యాపిల్లలతో కలిసి అదృశ్యం

గజ్వేల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ కాలనీలో కొత్త లొల్లి షురూ అయింది. గతంలో గ్రామాన్ని ఖాళీ చేయించిన సమయంలో ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన అరికెల చంద్రంకు తాత్కాలికంగా ఓ డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇవ్వడంతో చంద్రం తనకు వచ్చిన ప్యాకేజీ డబ్బులతో ఇంటిని బాగు చేయించుకున్నారు. ఇదే ఇంటిని గ్రామానికి చెందిన మరో బాధితుడికి రిజిస్ట్రేషన్ చేయడంతో సదరు వ్యక్తిని ఇంటిని ఖాళీ చేయించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అతను సిద్దిపేట ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం గజ్వేల్ ఆర్ఐ, పోలీసుల సహకారంతో ఇంట్లోని వస్తువులను పక్కన గదిలో పెట్టి ఇంటిని రిజిస్ట్రేషన్ అయిన వ్యక్తికి అప్పగించారు. దీంతో అధికారులతో చంద్రం వాగ్వాదానికి దిగారు. తాను ఇంటి మరమ్మత్తులకు దాదాపుగా రూ.12లక్షలు వెచ్చించానని, ఆ డబ్బులు ఇప్పించాలని చంద్రం కోరాడు. తన ఇంటిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఆవేదన చెందిన చంద్రం తన భార్యపిల్లలతో సహా కనిపించకుండా పోయాడు. దీంతో అధికారులపై చంద్రం తండ్రి బాలయ్య గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. చంద్రంకు రావాల్సిన ఆర్‌అండ్‌ఆర్‌లో భాగంగా ప్యాకేజీ, ప్లాటు, ఇంటి నిర్మాణానికి సంబంధించిన డబ్బులు వచ్చాయని, అయినప్పటికి ఖాళీ చేయడం లేదని అధికారులు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ... చంద్రంకు న్యాయంగా రావాల్సిన మరమ్మత్తుల డబ్బులు ఇప్పించాలన్నారు. గతంలో అధికారులే ఇంటి మరమ్మతుకు సంబంధించి అంచనా వేసి రూ.8 లక్షలుగా తేల్చారని, ప్రస్తుతం అదే అధికారులు బయటకు పంపించడం సరికాదన్నారు. చంద్రం కుటుంబసభ్యుల ఆచూకీ కోసం గ్రామస్థులు మల్లన్నసాగర్ కట్టపై వెతుకుతున్నట్లు తెలిసింది.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర పీఆర్వో కమిటీ కన్వీనర్‌గా రాజశేఖర్ కులకర్ణి

జోగిపేట, ఆగష్టు20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) ప్రజా సంబంధాల విభాగం (పీఆర్వో కమిటీ) కన్వీనర్‌గా జోగిపేటకు చెందిన రాజశేఖర్ కులకర్ణి ఏకగ్రీవంగా నియామకమయ్యారు. మంగళవారం వరంగల్‌లో జరిగిన సమావేశంలో ఈమేరకు ఆయన పదవీ స్వీకార ప్రమాణం చేశారు. రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన విజయ భాస్కర్ దేశ్‌పాండే, కోకన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన రవిశంకర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా శ్యామ్‌రావు పట్వారీ, వాసుదేవరావు, సురేశ్ జ్యోషి, మహిళా విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శిరీష కులకర్ణి, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా కరణం మారుతి రావు, పాండురంగా రావు, తిరుమల్‌రావు నియమితులయ్యారు.

రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం సంగారెడ్డిలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ తెచ్చిన సంస్కరణలు నేడు సాంకేతికంగా ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. గ్రామ స్వరాజ్యస్థాపన కోసం రాజీవ్‌గాంధీ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కసిని రాజు,జార్జి, సునీల్, పూజారి ప్రభాకర్, నవాజ్, తాహేర్‌పాషా, చిత్తారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలోని రాజీవ్‌పార్క్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

యూరియా కొరత లేదు

చేగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా కోసం ఎలాంటి ఆందోళన చెందవద్దని చేగుంట మండలంలో యూరియా కొరత లేదని, కావాలని మధ్య దళారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరంలాగానే కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయించబడిన యూరియా సరఫరా అయిందని, కావాలని కొంతమంది మధ్య దళారులు కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తున్నారని వారు పేర్కొన్నారు. యూరియా దొరకదేమోననే భయంతో రైతులు ముందుగానే కొని పెట్టుకోవడం వల్ల యూరియా కృత్రిమ కొరత ఏర్పడుతుందని వారు తెలిపారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

వట్‌పల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ప్రజలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని మర్వెల్లి గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధిక వర్షాల కారణంగా పాత ఇళ్లల్లో నివాసమున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

●**కొల్చారం:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రమేష్ అన్నారు. బుధవారం కొల్చారం గ్రామంలో ఇంటింటికి తిరిగి పరిశీలించారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి : ఎంపీడీవో

పుల్‌కల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కుట్టుమిషన్ శిక్షణ పొందడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని చౌటకూర్ ఎంపీడీవో కె.శంకర్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో గ్రామ స్వరాజ్య సంస్థ అధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. కుట్టుమిషన్ నేర్చుకోవాలనుకున్న మహిళలకు ఉచితంగా నెలరోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు.

శ్రమదోపిడీకి గురిచేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలు

హత్నూర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యాలు వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమదోపిడీకి గురిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. హత్నూర మండలంలోని పలు పరిశ్రమల్లో కార్మికుల భద్రత, వేతనాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

శ్రీరామ క్లోరో కెమికల్ ఐఎన్‌టీయూసీ కార్యవర్గం ఎన్నిక

జిన్నారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాజీపల్లి పారిశ్రామికవాడలోని శ్రీరామ క్లోరో కెమికల్ పరిశ్రమలో ఐఎన్‌టీయూసీ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన సలహాదారుడిగా మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, సయ్యద్‌రావుఫ్ ఎన్నికయ్యారు. పరిశ్రమలోని కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ తరఫున కృషి చేస్తామని వారు తెలిపారు.

మాదారం ప్రధాన రహదారికి మరమ్మతులు

జిన్నారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మాధారం-అవుటర్ రింగ్‌రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు బుధవారం మరమ్మతులు చేపట్టారు. మాదారం వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో స్టోన్ క్రషర్లు మరమ్మతు పనులకు రూ.5 లక్షల నిధులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపాయని, త్వరలోనే పనులు చేపడుతామని వారు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

● జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజీ


కొల్చారం మండలం రంగంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎల్లయ్య

జహీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దేవుజీ, ఉమ్మడి మెదక్ మైనార్టీ గురుకులాల ఆర్‌ఎల్‌సీ బహుమతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బూచనెల్లి గ్రామ శివారులో గల మైనార్టీ గురుకుల పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, విద్యాబోధన తదితరాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన కళాకృతుల ఎగ్జిబిషన్‌హాల్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఏవో మహ్మద్ వసీమోద్దీన్, ప్రిన్సిపాల్ రుబీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొల్చారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. బుధవారం రంగంపేట జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని, పాఠశాల గదులను పరిశీలించారు. వైరల్ ఫీవర్ రాకుండా పాఠశాల గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


రోబోటిక్‌పై నేర్చుకున్న పలు విషయాలను అధికారులకు వివరిస్తున్న విద్యార్థులు

అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్ నుంచి నిజామాబాద్‌కు నూతన బస్సును ప్రారంభించి మాట్లాడారు. రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందినప్పుడే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నారాయణఖేడ్ నుంచి నిజామాబాద్‌కు అధికశాతం ప్రజలు రాకపోకలు సాగిస్తారని, ఈ బస్సు ఈ ప్రాంత ప్రయాణికులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బస్సులో కొద్ది దూరం ప్రయాణించి, మొదటి టికెట్‌ను కొనుగోలు చేశారు.


ఖేడ్ నుంచి నిజామాబాద్‌కు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పాఠాలు విన్న డీఈవో


పాఠాలు వింటున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఆయన స్వయంగా విన్నారు. విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్‌క్వాస్ అవార్డు సాధించడం గర్వకారణం

● పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశంకర్

కంది, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలిసారిగా 12 విభాగాల్లో 87.01 శాతం స్కోరుతో కంది మండలంలోని చిద్రుప్ప ఉప ఆరోగ్యకేంద్రం ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) అవార్డు సాధించడం గర్వకారణమని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిశంకర్ కొనియాడారు. బుధవారం ఆయన పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి వెళ్లి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగనిర్మలకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిశంకర్ మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ సిబ్బంది అందరూ ప్రజలతో మమేకమై వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.


డీఎంహెచ్‌వో డాక్టర్ నాగనిర్మలకు కృతజ్ఞతలు తెలుపుతున్న కంది పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

వినాయక ఉత్సవాలను విజయవంతం చేద్దాం : డీఎస్పీ

జహీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పరస్పర సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో వివిధశాఖలకు చెందిన అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పండుగ ప్రారంభం మొదలుకుని వినాయని మజ్జనాలు జరిగేవరకు అధికారులు వారి పరిధిలోని విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి

తూప్రాన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలపై కేబుల్ తీగలు వేయరాదని తూప్రాన్ విద్యుత్ డీఈ గరుత్మంత్ అన్నారు. గణేష్ మండలపాల వద్ద ఊరేగింపులు, లైన్ల కింద బాణసంచా పేల్చడం, సిబ్బంది నిర్వాహకుల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

54 ప్రమాదకర భవనాలకు నోటీసులు

ఐడీఏబొల్లారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్విరామంగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా భవనాలను గుర్తించారు. కూలకముందే ఆయా ఇళ్లను ఖాళీచేసి వెళ్లాలని మున్సిపల్ అధికారులు సూచనలు చేశారు. స్థానికులు వినకపోవడంతో కమిషనర్ కిషన్ బృందంతో రంగంలోకి దిగారు. 54 ప్రమాదకర ఇళ్లకు నోటీసులు ఇచ్చారు. మరమ్మతులు చేయించుకోవాలంటూ నోటీసులో పేర్కొన్నారు. మరమ్మతులు చేయించుకోకపోతే ఇల్లు ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు.

చెరువుల పరిసరాల్లో అప్రమత్తంగా ఉండండి

పటాన్‌చెరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 390 చెరువులున్నాయని చెప్పారు. 80 చెరువుల అలుగులు పారుతున్నాయని వివరించారు. రానున్నరోజుల్లో మరిన్ని వర్షాలు కురవనున్న నేపథ్యంలో చెరువుల కట్టలు తెగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ భీమ్, డీఈ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతలు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, పద్మారావు శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. 23న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పాపన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పంతులు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

రాజీవ్‌గాంధీ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్


నర్సాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్


రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్


హత్నూర : దౌల్తాబాద్‌లో రాజీవ్‌గాంధీ జయంతిలో కాంగ్రెస్ నాయకులు



చేగుంట: వడియారంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్, నాయకులు

ముంచేను

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో పత్తి, మినుము, పెసర, సోయా పంటలు దెబ్బతిన్నాయి. క్షేత్రస్థాయిలో పర్యటించి నష్ట వివరాలను నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

● మనూరు మండలంలో వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్ దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు.

● నాగల్‌గిద్ద మండలంలో మోర్గి, శాపూర్‌లో నీట మునిగిన పత్తి, సోయాబీన్ పంటలను వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి పరిశీలించారు.

కోహీర్ మండలంలో నారింజ వాగు ఉప్పొంగడంతో దీని పరీవాహక ప్రాంత గ్రామాలైన పైడిగుమ్మల్, పోతిరెడ్డిపల్లి, కవెల్లి, రాజనెల్లి, గురుజువాడ, మద్రిలో మొక్కజొన్న, పత్తి, సోయా, మినుము పంటలకు నష్టం వాటిల్లింది.

మొత్తంగా జిల్లాల్లోని రైతులు పంటనష్టంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

కూలిన ఇళ్లు, దెబ్బతిన్న రోడ్లు

● తూప్రాన్ మండలంలో కురిసిన వర్షాలకు 16 ఇళ్లు దెబ్బతిన్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కిష్టాపూర్, ఇమాంపూర్, ఘనపూర్, యావపూర్, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లిందని, బాధితులకు తక్షణ సాయంగా బియ్యం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

● నారాయణఖేడ్‌లోని నాగాపూర్‌తండాలో కోలరాములు ఇంటి గోడ కూలింది. కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది.

● చిన్నశంకరంపేట మండలం కోర్విపల్లిలో ముత్తిగల్ల జనార్ధన్ ఇంట్లో గోడ కూలడంతో, భారీ శబ్దానికి కుటుంబసభ్యులు వెంటనే బయటకు పరుగుతీసి ప్రాణాలు దక్కించుకున్నారు.

● మనోహరాబాద్ మండలంలో దెబ్బతిన్న ఇళ్ల వివరాలను తెలపడంలో తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓవైపు వర్షాలు పడుతుంటే ఆయన ఫోన్ ఐదు రోజులుగా అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● మనూరు మండలం దోషూరు క్రాస్ రోడ్ నుంచి ఎల్గోయి, అతిమ్యాల్, ఎన్‌జి.హుక్రన గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు వద్ద కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నీటి నిల్వతోనే వ్యాధులు : ఎంపీడీవో

చిన్నశంకరంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నీటి నిల్వతోనే వ్యాధులు ప్రబలుతాయని ఎంపీడీవో దామోదర్, వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు అన్నారు. వర్షాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు బుధవారం ఎంపీపీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వచ్ఛతపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీధుల్లో శానిటేషన్ చేయాలన్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గిరిజారాణి, ఏపీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌సీవో వైఖరిని నిరసిస్తూ ఆందోళన

నారాయణఖేడ్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబాపూలే గురుకులంలో విద్యార్థులు గజ్జితో బాధపడుతున్నా మౌలిక వసతులు కల్పించడంలో ప్రిన్సిపల్ విఫలమైనా ఆర్‌సీవో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ పాఠశాల ఎదుట బీజేపీ, ఏబీవీపీల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దశరత్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించినా ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 50 మంది వరకు గజ్జితో సతమతం అయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఏబీవీపీ నగర కార్యదర్శి శంకర్, నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పెద్దశంకరంపేట వైద్య సిబ్బంది గజ్జితో బాధపడుతున్న 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అసత్య ఆరోపణలు సరైంది కాదు

● మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి

కంగ్టి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కంగ్టి- ముకుంద నాయక్‌తండాల మధ్య వర్షం ధాటికి కొట్టుకుపోయిన వంతెనను రాజకీయం చేస్తూ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో పాటు తన ప్రమేయం ఉన్నట్లు దిశ కమిటీ సభ్యుడు ప్రకాష్‌రాథోడ్ తప్పుడు ప్రచారం చేయడం సరైందికాదని మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రోడ్డు పనులు ఏ కాంట్రాక్టర్ చేశారో కూడా తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. మాజీ ఎమ్మెల్యేను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక కొంతమంది ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడానికి ప్రకాష్ రాథోడ్ లాంటివారిని వాడుకుంటున్నారన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

పెద్దశంకరంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు సూచించారు. బుధవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపాయలతండా గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం తండాలోని ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించారు.

ప్యాటగడ్డలో ఫీవర్ సర్వే

చిన్నశంకరంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ఎస్ కొండాపూర్ మదిర గ్రామం ప్యాటగడ్డలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వేను బుధవారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నాలుగురోజుల క్రితం మాడబోయిన స్వామి జ్వరంతో మృతిచెందిన సంగతి తెలిసినదే. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల వైద్యాధికారి సాయిసింధులోని ఫీవర్ సర్వేచేసి ప్రజల ఆరోగ్య సమస్యలపై ఆరాతీశారు.

'ఆక్రమణలను తొలగించాలి'

జహీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు వెళ్లేందుకు వీలుగా దత్తగిరి కాలనీ మీదుగా ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని, కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు.